క్లుప్తంగా

రాజీవ్‌గాంధీ సేవలు ఎనలేనివి

కర్నూలు(సెంట్రల్): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశం అభివృద్ధి చెందడానికి మాజీ ప్రధాని మంత్రి రాజీవ్‌గాంధీ చేసిన సేవలు ఎనలేనివని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.బాబురావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా నాయకులు రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశంలో పెద్ద సంఖ్యలో జవహర్ నవోదయ విద్యాయాలు నెలకొల్పి గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించారని పేర్కొన్నారు. అనంతరం సీక్యాంప్ కూడలిలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మాజీమంత్రి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యానారాయణ గుప్త పాల్గొన్నారు.

కొల్లినాగేశ్వరరావు మృతి తీరని లోటు

కర్నూలు(సెంట్రల్): ఏపీ నీటి హక్కుల పరిరక్షణ కోసం కొల్లి నాగేశ్వరరావు ఎంతో పోరాటం చేశారని, ఆయన లేని లోటు తీర్చలేనిదని చేతివృత్తిదారుల రాష్ట్ర కార్యదర్శి కె.రామాంజనేయులు అన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సీఆర్ భవన్‌లో కమ్యూనిస్టు ఉద్యమ నేత కొల్లి నాగేశ్వరరావు 4వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పి.రామకృష్ణారెడ్డి, దంబోలం శ్రీనివాసరావు, సురేంద్ర యాదవ్, బీసన్న, నాగరాజు, మల్లికార్జున పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు

సి.బెళగల్: మండలంలో ప్రభుత్వ అనుమతు లేకుండా పాఠశాలలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎంఈఓ జ్యోతి హెచ్చరించారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నిర్మితమవుతున్న ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు కొత్త ప్రైవేట్ పాఠశాలలు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లు ఫిర్యాదులు అందడంతో విచారించినట్లు చెప్పారు. నివేదికలను ఉన్నత అధికారులకు పంపి వారి ఆదేశాలతో చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని నూలుమిల్లు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే సిబ్బంది తెలిపారు. పాణ్యం గ్రామానికి చెందిన యాటగిరి సుధాకర్, మధుకుమార్ బైక్‌పై నంద్యాలకు వెళ్తుండగా వెనుక వస్తున్న కారు ఢీకొందన్నారు. ఈ ఘటనలో సుధాకర్, మధు కుమార్‌కు గాయాలు కావడంతో శాంతిరాం ఆసుపత్రికి తలించారు. బైక్‌ను ఢీకొన్న కారు అతివేగంగా వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. హైవే పెట్రోల్ సిబ్బంది హైవేపై ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

భక్తులతో కిటకిటలాడిన మూలపెద్దమ్మ ఆలయం

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్ద అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. పెద్దఎత్తున తరలివచ్చి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చైర్మన్ తలారి చిన్నన్న, ఈఓ మోహన్‌లు ఏర్పాట్లు చేశారు.వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

నల్లమట్టి అక్రమ తవ్వకాలను అరికట్టండి

పగిడ్యాల: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా నల్లమట్టి తవ్వకాలు చేపట్టరాదని తహసీల్దార్ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అయా గ్రామాల్లోని ప్రభుత్వ, దేవదాయ, చెక్ డ్యాం, చెరువులు, శివాయిజం, డీకేటీ, కాలువలు తదితర ప్రభుత్వ భూములు ఎవరి పరిధిలోకి వస్తాయో వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందని వీఆర్వోలకు సూచించారు. నల్లమట్టి అవసరమయ్యే రైతులు ముందస్తుగా సంబంధిత శాఖ అధికారులకు అర్జీ పెట్టుకుని వారు నో అబ్జక్షన్ సర్టిఫికెట్ జారీ చేస్తే మైనింగ్ అధికారులకు క్యూబిక్ మీటర్ల చొప్పున చెలానా కట్టాలనే నిబంధనలు ఉన్నాయని వివరించారు. అందువల్ల నెహ్రూనగర్, పగిడ్యాల, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం, ముచ్చుమర్రి, సంకిరేణిపల్లె తదితర గ్రామాల్లోని మధ్యవర్తుల కనుసన్నల్లో నల్లమట్టిని అక్రమంగా తరలించి ధనార్జన సాగిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. అలాంటి వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. తక్షణమే వీఆర్వోలు అక్రమ మట్టి త్రవ్వకాలను అరికట్టడంపై దృష్టి సారించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, అలాగే నెహ్రూనగర్‌లో రైతులతో మాట్లాడి మట్టి తవ్వకాలపై నివేదిక ఇవ్వాలని ఇన్‌చార్జ్ ఆర్ఐ చంద్రమౌళి, వీఆర్వో వెంకటస్వామిని ఆదేశించారు. వీఆర్వోలు నాగన్న, నరసింహులు, వెంకటస్వామి, భగవాన్‌దాస్ తదితరులు ఉన్నారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ
- ఆర్‌యూలో ఈవీఎంల స్ట్రాంగ్ రూముల పరిశీలన



కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి

కర్నూలు (టౌన్) : వచ్చే నెల 4న జరిగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, విధి విధానాలు ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలన్నారు. మంగళవారం నగర శివారులోని రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్ల గురించి ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. టేబుళ్లు, అవసరమైన ఫెన్సింగ్ పనులు, బారికేడ్లు, కుర్చీలు, విధులకు హాజరయ్యే సిబ్బందికి తాగునీరు, తదితర సౌకర్యాలపై చర్చించారు. అనంతరం రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ కౌంటింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేపట్టాలన్నారు. ఏ ఒక్కరికి ఇబ్బంది కలగకుండా పక్కాగా సౌకర్యాలు కల్పించాలన్నారు. కౌంటింగ్‌లో ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేకంగా ఫెన్సింగ్ కుర్చీలు, టేబుళ్లు ఏర్పాటు చేయాలన్నారు. టేబుళ్ల వారీగా రౌండ్‌ల వారీగా ఫలితాలను జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషన్‌కు ఎప్పటికప్పుడు అందించేందుకు అవసరమైన కంప్యూటర్లు, ఇంటర్ నెట్ సదుపాయం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన ఆర్‌ఓ

రోజు వారీ తనిఖీల్లో భాగంగా రాయలసీమ యూనివర్సిటీలో కర్నూలు అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌లను రిటర్నింగ్ అధికారి పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలతో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రవేశ ద్వారం, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఉన్న లాగ్ బుక్స్‌లో ఆర్‌ఓ సంతకాలు చేశారు. కార్యక్రమంలో నగరపాలక డీఈఈ రవిప్రకాష్‌నాయుడు, రహదారులు, భవనాల శాఖ డీఈ భారతి, ఏఈ జనార్దన్ పాల్గొన్నారు.

జీవనశైలి మార్పులే రక్తపోటుకు కారణం



వైద్య సేవలను పరిశీలిస్తున్న డాక్టర్ హేమలత

కల్లూరు: జీవనశైలిలో మార్పులే రక్తపోటుకు కారణమని రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమ అధికారిని డాక్టర్ హేమలత అన్నారు. మంగళవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కె.మార్కాపురంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనరోజు వారి ఆహారపు అలవాట్లు, వ్యాయమంతో రక్తపోటుకు దూరంగా ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు. బీపీ (రక్తపోటు), మధుమేహం ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలన్నారు. రక్తపోటు పెరిగితే పక్షవాతం, గుండెపోటు వచ్చే అవకాశం ఉందన్నారు. మద్యపానం, ధూమపానం, కొవ్వు పదార్థలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ మోతీలాల్ నాయక్, సామాజిక ఆరోగ్య అధికారి ఫరీదా, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం మద్దిలేటిస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

ఓర్వకల్లు : మండల పరిధిలోని నన్నూరు గ్రామ సమీపంలో గల చింతలముని రంగస్వామి దేవాలయంలో వెలసిన లక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామివారి కళ్యాణం కమనీయంగా సాగింది. ఆలయ పూజారి చంద్రకళ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం లక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి జయంతి సందర్భంగా పురోహితులు నాగనంద శర్మ బృందం సభ్యులు శాస్త్రోక్తంగా స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య జరిగిన కల్యాణాన్ని భక్తులు తిలకించి పరవశించిపోయారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. రాత్రి వివిధ భజన మండలి సభ్యులతో అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు చింతలముని రంగస్వామి, నాగ యనమల, కర్రెన్న, మునిరంగడు, గుర్రం వెంకటేశ్వర్లు, ఎర్రన్న, చిన్న యరమల, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రమణీయం..రథోత్సవం



లక్ష్మీనరసింహస్వామి రథోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో వెలసిన నవరత్నాల లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం మంగళవారం సాయంత్రం రమణీయంగా సాగింది. ముందుగా లక్ష్మీనరసింహస్వామి అమ్మవార్లకు వేద పండితులు అంగరంగ వైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తుల విగ్రహాలను రథంపై ఆశీనులను చేసి గోవిందా నామస్మరణల మధ్య ముందుకు లాగారు. అనంతరం యథాస్థానానికి చేర్చారు.

నారాయణరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తా

వెల్దుర్తి(కృష్ణగిరి): తన భర్త, దివంగత వైఎస్సార్‌సీపీ నాయకుడు చెరుకులపాడు నారాయణరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తానని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులతో ఆమె వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామంలోని సమాధికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బోయ సాంబశివుడు చిత్ర పటానికి కూడా శ్రీదేవి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కోసం ఆయన చేసిన సేవలను శ్రీదేవి కొనియాడారు. తన భర్త ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటే ప్రజానేతగా ఎదిగారన్నారు. ఆయన ఆశయ సాధనలో తాను ప్రజాసేవకు అంకితమయ్యానన్నారు. 2014 ఎన్నికల్లో ఫ్యాక్షన్ రాజకీయాలకు చరమ గీతం పాడి తనను ఆశీర్వదించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందించానని, మరో మారు ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా విజయం సాధించబోతున్నానన్నారు. నివాళులు అర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, శ్రీదేవి కుమారుడు రామ్మోహన్‌రెడ్డి, కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, వెల్దుర్తి సొసైటీ చైర్మన్ వంశీధర్‌రెడ్డి, జిల్లా నాయకులు తుగ్గలి మోహన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎర్రగుడి రామచంద్రారెడ్డి, పెండేకల్ భాస్కర్‌రెడ్డి, పీఎండీ హుసేన్, రాతన మోహన్‌రెడ్డి, తుగ్గలి మండల కన్వీనర్ జిట్టా నాగేష్, హనుమంతు, పగిడిరాయి జగన్నాథరెడ్డి, కడమకుంట్ల అమర్నాథరెడ్డి, శ్రీరంగడు, సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, శిగరమాను కృష్ణమూర్తి,పోతురెడ్డి, మహేశ్వరరెడ్డి, ప్రహ్లాద ఉన్నారు.

కమనీయం.. లక్ష్మీచెన్నకేశవుడి కల్యాణం

మిడుతూరు: మండలకేంద్రంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం తెల్లవారుజామున శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. వేదపండితులు సుబ్రమణ్యం శర్మ ఆధ్వర్యంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపంలో ఆశీనులు చేశారు. మేళతాళలతో భక్తజనుల గోవింద నామస్మరణ మధ్య కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు సోమవారం అర్ధరాత్రి నుంచి వరుడి అలంకరణలో స్వామివారిని పల్లకీలో పురవీధుల గుండా ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున 5.20 నిమిషాలకు మేషలగ్నంలో కల్యాణ వేడుక కమనీయంగా సాగింది. ఈఓ వెంకటరమణ, ఆలయ పురోహితులు వెంకట్రామయ్య, గ్రామ పెద్దలు తువ్వా శివ రామకృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, బన్నూరు నాగిరెడ్డి, బన్నూరు శ్రీనివాసరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాహన సేవలు

కల్యాణ మహోత్సవం అనంతరం స్వామి అమ్మవార్లను ఉదయం శేషవాహనంపై, సాయంత్రం హనుమత్ వాహనంపై ఆశీనులను చేసి హనుమత్ ఉత్సవ కార్యక్రమాన్ని గ్రామ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

కౌంటింగ్ ఏజెంట్ల కోసం దరఖాస్తులివ్వాలి





సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య, హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు

- పాణ్యం నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు వారి తరపున కౌంటింగ్ ఏజెంట్ల ఏర్పాటుకు 30వ తేదీ లోపు దరఖాస్తులను సమర్పించాలని ఆ నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పాణ్యం నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌ను రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ బ్లాక్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. కౌంటింగ్ ఏజెంట్ల కోసం 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు తన కార్యాలయంలో సమర్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం 6 టేబుళ్లను ఏర్పాటు, ఈవీఎంల కౌంటింగ్ కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఒక్కో టేబుల్‌కు ఒక్కో ఏజెంట్‌ను నియమించుకోవచ్చన్నారు. కౌంటింగ్ హాలులోకి ఏజెంట్లు సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లడానికి అనుమతి ఉండదన్నారు. ఈ విషయాన్ని అందరికీ తెలియజేయాలని ఆమె సూచించారు.

న్యాయవాదుల సమస్యలపై చొరవ చూపాలి



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

కర్నూలు (లీగల్) : న్యాయవాదుల సమస్యలపై ఏపీ రాష్ట్ర బార్ కౌన్సిల్ తక్షణమే చొరవ చూపాలని కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.కృష్ణమూర్తి, రవికాంత్ ప్రసాద్, బార్ కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా అన్నారు. మంగళవారం జిల్లా న్యాయవాదుల సంఘం కార్యాలయంలో నూతన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వెల్ఫేర్ ఫండ్‌ను రూ.10 లక్షలకు పెంచాలన్నారు. న్యాయవాదులకు హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని, నూతన ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, 35 సంవత్సరాల వయస్సు దాటిన వారికి వెల్ఫేర్ ఫండ్, అనుమతి తీసుకుని వర్తింపజేయాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు నెల నెలా స్టైఫండ్ రూ.10 వేలు ఇవ్వాలని, న్యాయవాదుల రక్షణ చట్టం 2023పై బిల్లు పాస్ చేయాలన్నారు. ఇన్సూరెన్స్ 2024ను రెన్యువల్స్ చేయించాలన్నారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షులు నాయుడు, కె.మోహన్ బాబు, నిత్య జీవన్ రాజ్, ఎం.మహబూబ్ బాషా, టీసీ పుల్లన్న, భాస్కర్, ఇ.రాజేష్, సుమన రాణి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తులను బట్టే కులాలు



మాట్లాడుతున్న వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి కప్పగంతుల కోటేశ్వర శర్మ

కర్నూలు కల్చరల్: హిందూ సమాజంలో వృత్తులను బట్టి ఏర్పడిన కులాల్లో విబేధాలు లేవని వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి కప్పగంతుల కోటేశ్వర శర్మ అన్నారు. మంగళవారం స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయం కల్యాణ మండపంలో 'కుల సంఘాల దేవాలయ కమిటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం హిందువులందరూ ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, ఉపాధ్యక్షులు సోమిశెట్టి వెంకట్రామయ్య, కోశాధికారి సందడి మహేశ్వర్, జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, నగర అధ్యక్షుడు మద్దిలేటి, చెన్న కేశవ ఆలయ కమిటీ అధ్యక్షుడు నరసింహులు, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భాను ప్రకాష్, సహ కార్యదర్శులు గిరిబాబు, గోవిందరాజులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డులో కర్నూలు విద్యార్థి



వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్లతో చరణ్

కర్నూలు కల్చరల్: నగరానికి చెందిన బతిని చరణ్ వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డులో కెక్కాడు. పీరియాడిక్ టేబుల్ (ఆవర్తన పట్టిక)లోని అన్ని అంశాలను వేగంగా పఠించి ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. 9 నుంచి 12 సంవత్సరాల వయసు విభాగంలో ఆవర్తన పట్టకలోని అన్ని మూలకాలను అత్యంత వేగంగా 42 సెకన్ల 35 మిల్లీ సెకన్లలో చెప్పి రికార్డు సృష్టించాడు. స్థానిక కొత్తపేటకు చెందిన ఈ విద్యార్థి తల్లి నాగ శివమ్మ గృహిణి, తండ్రి బతిని శివభాస్కర్ లారీ ట్రాన్స్ పోర్ట్ వ్యాపారి. ప్రయివేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఈ విద్యార్థి ఉపాధ్యాయురాలు ఎస్.జి.సుమలత దగ్గర రెండేళ్ల నుంచి ట్యూషన్‌కు వెళ్తున్నాడు. 'మార్చి 8వ తేదీన ఆవర్తన పట్టికలోని 1-118 మూలకాలను 42 సెకన్ల 35 మిల్లీ సెకన్లలో చెప్పించి రికార్డు చేయించి 9వ తేదీన వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డు వారికి వీడియోను అప్‌లోడ్ చేశాం. వారు క్షుణ్ణంగా పరిశీలించి 9-12 సంవత్సరాల వయస్సు విభాగంలో అతి తక్కువ సమయంలో చెప్పి రికార్డు నెలకొల్పినట్లు విశ్లేషణ చేసుకొని మార్చి 19వ తేదీన బుక్‌లో రిజిస్టర్ చేశారు. ఈమేరకు రెండు రోజుల క్రితం గూగుల్‌లో అధికారికంగా వెలువరించా'రని టీచర్ సుమలత చెప్పారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అల్లర్లు సృష్టించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని పాణ్యం సీఐ నల్లప్ప హెచ్చరించంఆరు. మంగళవారం సుగాలిమెట్ట గ్రామంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం

- నూనెగింజల పంటల్లో అంతర పంటలు సాగు ఎంతో మేలు
- ఖరీఫ్ సీజన్ పంటలపై రైతులకు అవగాహన అవసరం
- వ్యవసాయశాఖ కర్నూలు సబ్ డివిజన్ సాంకేతిక వ్యవసాయాధి అధికారి దస్తగిరిరెడ్డి



అంతర పంట సాగు దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): అనాదిగా నూనెగింజల పంటలు వర్షాధారంగా మెట్ట భూముల్లో సాగు చేయబడుతున్నాయి. పలు పంటల సరుకుల్లో నూనెగింజల పైర్ల ప్రాముఖ్యత ఎంతో ఉంది. మెట్ట వ్యవసాయ ప్రాంతాల్లో వర్షపాతాన్ని బట్టి పైర్లు వివిధ దశల్లో అనావృష్టి (బెట్ట) పరిస్థితులనెదుర్కొంటూ ఉంటాయి. ఈ పరిస్థితుల్లో దిగుబడులతో పాటు స్థిరమైన లాభాలను ఆర్జించే విషయంలో నూనెగింజల పైర్లతో కూడిన అంతర పంటలు దోహదపడుతున్నాయి. జిల్లాలో అనువైన సిఫారసు చేయబడిన లాభసాటి అయిన ఆముదం, ప్రొద్దుతిరుగుడులతో కూడిన అంతర పంటల గురించిన విషయ పరిజ్ఞానం మెట్ట రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నూనెగింజల పంటల్లో వేసుకోవాల్సిన అంతర పంటల గురించి వ్యవసాయశాఖ కర్నూలు సబ్ డివిజన్ సాంకేతిక అధికారి దస్తగిరిరెడ్డి వివరించారు. అంతర పంటల వల్ల అదనపు ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు.

● ఆముదంలో కంది..

ఈ పైర్లను 1:1 నిష్పత్తిలో విత్తుకోవాలి. ఆముదాన్ని 20 సెంటీమీటర్లు ఎడం సాళ్లలో విత్తుకోవాలి. మొక్కల మధ్య 60 సెంటీమీటర్ల ఎడం ఉంచుకోవాలి. దుక్కిలో హెక్టారుకు 40 కిలోల నత్రజని, 40 కిలోల బాస్వరం, 30 కిలోల పొటాష్ వేయాలి. ఆముదం విత్తన 40 రోజులకు 20 కిలోల నత్రజని, ఆముదానికి మాత్రమే వేయాలి.

● ఆముదంలో పెసర/అలసంద /సోయాచిక్కుడు

ఈ పంటలను 1:2 నిష్పత్తిలో సాగు చేసుకోవాలి. 90 సెం.మీ ఎడంలో ఆముదం విత్తనాన్ని వేసుకోవాలి. ఆముదం సాళ్ల మధ్యలో రెండుసాళ్ల అంతర పంటలు వేసుకోవచ్చు. పెసర 70 రోజుల్లో అలసంద 90 రోజుల్లో, సోయాబీన్ 90 రోజుల్లో కోతకు వస్తాయి. అలసందను కూరకు గానీ విత్తనానికి గానీ వాడుకోవచ్చు. ఆముదానికి దుక్కిలో హెక్టారు 40 కిలోల నత్రజని, 40 కిలోల బాస్వరం, 30 కిలోల పొటాష్‌లనిచ్చే ఎరువులను వేసుకోవాలి. విత్తిన 40 రోజులకు హెక్టారుకు 20 కిలోల నత్రజనిని ఆముదానికి వేయాలి. గోరుచిక్కుడు అంతర పంటగా పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లోని రైతాంగానికి లాభసాటిగా ఉంటుంది.

● ఆముదంలో వేరుశనగ

ఈ పైర్లను 1:5 నిష్పత్తిలో సాగు చేయాలి. ప్రతి ఐదు సాళ్ల వేరుశనగ తర్వాత ఒక సాలు ఆముదం విత్తుకోవాలి. దుక్కిలో హెక్టారుకు 30 కిలోల నత్రజని, 60 కిలోల బాస్వరం, 30 కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. విత్తిన 40 రోజులకు 20 కిలోల నత్రజనిని ఆముదం పేరుకు పైపాటుకు అందించాలి. వేరుశెనగకు హెక్టారుకు 500 కిలోల జిప్సం పూత సమయంలో వేర్లకు దగ్గరగా వేయాలి.

● ఆముదంలో ప్రొద్దుతిరుగుడు..

ఈ పైర్లను 1:1 నిష్పత్తిలో వేయాలి. రెండు ఆముదం సాళ్ల మధ్య ఒక వరుస ప్రొద్దుతిరుగుడు పంట వేసుకోవాలి. చివరి దుక్కిలో హెక్టారుకు 40 కిలోల నత్రజని, 40 కిలోల బాస్వరం, 30 కిలో పొటాష్‌లను వేసుకుని, విత్తన 40 రోజులకు 20 కిలోల నత్రజనిని పైపాటుగా రెండు పంటలకు వేయాలి.

● ప్రొద్దుతిరుగుడులో వేరుశనగ..

ఈ పైర్లను 6:2 నిష్పత్తిలో సాగు చేసుకోవాలి. చివరి దుక్కిలో హెక్టారుకు 30 కిలోల నత్రజని, 60 కిలోల బాస్వరం, 30 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వేసుకోవాలి. విత్తిన పది రోజులకు 10 కిలోల నత్రజని ప్రొద్దుతిరుగుడుకు వేయాలి. వేరుశనగకు పూత సమయంలో 50 కిలోల జిప్సం వేయడం వల్ల గింజ బాగా కడుతుంది.

● పొద్దుతిరుగుడులో కంది..

ఈ పంటలను 1:1 నిష్పత్తిలో సాగు చేసుకోవాలి. ప్రొద్దుతిరుగుడు కోసిన తర్వాత కంది ఏపుగా పెరిగి, మంచి దిగుబడినిస్తుంది. విత్తిన 30 రోజులకు హెక్టారుకు 10 కిలోల నత్రజనిని ప్రొద్దుతిరుగుడుకు వేయాలి.

● ప్రొద్దుతిరుగుడులో మినుము /పెసర/సోయాబీన్

ఈ పైర్లను 1:2 నిష్పత్తిలో సాగు చేసుకోవాలి. ఒక సాలు ప్రొద్దుతిరుగుడు తర్వాత రెండుసాళ్ల ఈ అపరాల జాతికి చెందిన పైర్లను సాగు చేసుకుంటే భూమికి బాగా సత్తువ ఏర్పడి ప్రొద్దుతిరుగుడు దిగుబడులపై ఏమాత్రం చెడు ప్రభావం ఉండదు. విత్తిన 30 రోజులకు ప్రొద్దుతిరుగుడు మాత్రం 20 కిలోల నత్రజని నిసై పాటుగా వేయాలి. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఈ విధమైన అంతర పంటల విధానాలను రైతులు అవలంబినట్లయితే రైతులు వేసుకునే ప్రధాన పంట దిగుబడులకు అవరోధం లేకుండా అంతర పంటల నుంచి దిగుబడులను ఇతోధికంగా పొందవచ్చు. తద్వారా నికర ఆదాయాన్ని పెంచుకోవచ్చు.